క్లుప్తంగా

'ఉపాధి' పనుల పరిశీలన

చాగల్లు: ఉపాధి హామీ పథకం కింద మండలంలో చేపడుతున్న పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని ఎంపీడీవో నాతి బుజ్జి సూచించారు. ఉపాధి హామీ పథకం కింద చాగల్లులో జరుగుతున్న పంట కాలువ పూడిక పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీల పనిదినాల సంఖ్యను పెంచాలన్నారు. ఉపాధి పనులపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కూలీల మస్టర్‌లలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. అన్ని గ్రామాల్లో పనులు జరిగేలా, కూలీలు అందరికీ ఉపాధి లభించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో 37 మందికి ఉచిత అడ్మిషన్లు

చాగల్లు: ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య కోసం ఒకటో తరగతిలో ప్రవేశానికి మండలం నుంచి దరఖాస్తు చేసుకొన్న వారిలో 55 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈవో ఎం.సుభాకర్ తెలిపారు. వారిలో 37 మంది మాత్రమే ప్రవేశాలు పొందారని చెప్పారు. చాగల్లులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్య కానుకలో భాగంగా 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు మండల కేంద్రానికి చేరాయని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విద్య పొందాలంటే పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని కోరారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

చాగల్లు: వేసవిలో వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని బ్రాహ్మణగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి కె.నిశిత సూచించారు. చాగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వడదెబ్బ తగిలిన వారిని చల్లని ప్రదేశంలో ఉంచి, కొబ్బరి నీళ్లు, మజ్జిగ ఇవ్వాలన్నారు. అవసరం మేరకు డాక్టర్ వద్దకు తీసుకెళ్లి వైద్యం చేయించాలని చెప్పారు. సుమారు 40 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే గర్భిణులు, బాలింతలు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 104 వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

కృష్ణబాబు కుటుంబానికి ప్రముఖుల పరామర్శ

కొవ్వూరు: ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పెండ్యాల కృష్ణబాబు కుటుంబ సభ్యులను శుక్రవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. దొమ్మేరులోని ఆయన స్వగృహానికి వెళ్లి కృష్ణబాబు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు అనసూరి పద్మలత, గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు కృష్ణబాబు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలంటూ ప్రార్థించారు. వివిధ ప్రాంతాల నుంచి పలువురు వచ్చి కృష్ణబాబు అల్లుడు రాజీవ్‌కృష్ణ, సోదరులు నరేంద్రనాథ్ చౌదరి, అచ్చిబాబు, ఇతర కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

31న మేరీమాత ఉత్సవం

మధురపూడి: రాజమహేంద్రవరంలోని గోదావరి విచారణ దేవాలయంలో మే 31న క్రైస్తవుల సహాయమాత పండగను నిర్వహించనున్నట్టు ఆర్‌సీఎం రెవరెండ్ ఫాదర్ మనోజ్ కుమార్ తెలిపారు. కోరుకొండ మండలం బూరుగుపూడిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఏటా నిర్వహిస్తున్న తరహాలోనే మేరీమాత పండగ జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 22న మొదలైన నవదిన ప్రార్థనలు 30 వరకూ జరుగుతాయన్నారు. గడచిన సంవత్సరమంతా కాపాడినందుకు కృతజ్ఞతా ప్రార్థనలు చేస్తారని, చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు.

ఈత సరదా.. ప్రాణాలకు హాని కదా..

- వేసవిలో గోదావరి, కాలువల్లో స్నానాలు చేస్తూ సేద తీరుతున్న పిల్లలు
- స్నానానికి దిగి గల్లంతవుతున్న యువత
- కన్నవారికి పుట్టెడు శోకం



శెట్టిపేట కాలువలో స్నానం చేస్తున్న చిన్నారులు (ఫైల్)

నిడదవోలు రూరల్: వేసవి వచ్చిందంటే చాలు పిల్లలు, పెద్దలు అనే భేదం లేకుండా అన్ని వయసుల వారూ నదులు, కాలువలు, చెరువుల్లో ఈత కొడుతూ సేద తీరుతుంటారు. ఈత తెలిసిన వాళ్లకు సరదాగానే ఉంటుంది. నీళ్లంటే భయపడే వారు మాత్రం ఈత నేర్చుకోవడానికి ఇష్టపడరు. దీంతో ఈత రానివారు జలాశయాల్లో దిగినపుడు ప్రమాదాల బారిన పడుతున్నారు.ఈ క్రమంలో ఒక్కోసారి ప్రాణాలు కూడా పోగొట్టుకుని బంధువులకు పుట్టెడు దుఃఖాన్ని మిగులుస్తున్నారు.

ప్రస్తుతం విద్యా సంస్థలకు సెలవులు. దీంతో ఇంటి పట్టునే ఉండే విద్యార్థుల కదలికలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. ఎంత కట్టడి చేసినా సెలవుల్లో బయటకు వెళ్లే పిల్లలే అధికం. విరామ సమయంలో చిన్నారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తే వారి భవిష్యత్తు, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి ప్రమాదాల నుంచి పిల్లలను కాపాడడానికి పెద్దలు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతో ఉంది. పెరవలి, కొవ్వూరు, తాళ్లపూడి, నిడదవోలు మండలాలు, గోష్పాద క్షేత్రం, విజ్జేశ్వరం బ్యారేజీ గోదావరి తీరం వెంబడి ఉన్నాయి. వేసవిలో వేలాది మంది విద్యార్థులతో పాటు సందర్శకులు గోదావరి నదిలోకి, గోదావరి కాలువల్లోకి దిగి స్నానాలు చేస్తుంటారు. ఈ క్రమంలో కొందరు లోతును అంచనా వేయడంలో విఫలమై ప్రమాదాల్లో చిక్కుకుంటున్నారు. కొందరైతే ఏకంగా ప్రాణాలే కోల్పోయి, కన్నవారికి కన్నీరే మిగులుస్తున్నారు. ప్రస్తుతం కాలువలన్నీ మూసివేశారు. దీంతో నీటిని గోదావరిలోకి విడిచిపెట్టనున్నారు. ఈ సమయంలో లంక పొలాల్లోకి వెళ్లే రైతులు, కూలీలు, స్నానాలు చేసే యువకులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్రమత్తంగా లేకపోతే పెను ప్రమాదాలు తప్పవు.

ప్రాణం తీస్తున్న యువత సరదా

ఈత సరదాతో ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. ఏటా కొవ్వూరు, నిడదవోలు, పెరవలి మండలాల పరిధిలో గోదావరి నదిలో స్నానానికి అనేక మంది మృత్యువాత పడుతున్నారు. సెలవుల్లో మధ్యాహ్నం, సాయంత్రం, పాఠశాలలు తెరిచి ఉన్నపుడు ఆదివారాల్లో ఈ ప్రాంతంలోని ప్రమాదకర ప్రదేశాల్లో స్నానాలకు దిగి ప్రాణాలు కోల్పోతున్నారు.

చిన్నారులు ఇలా చేయాలి

వేసవి వచ్చిందంటే చాలు గ్రామాల్లోని కాలువలు, నదీ తీరాలు ఈత కొట్టేవారితో నిండిపోతాయి. తెలియని వారికి ఈత నేర్పించేలా చేస్తే ప్రమాదం నుంచి వారిని కాపాడినవారమవుతాం. ఈత నేర్చుకోవడం ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిది. స్నానానికి దిగేటపుడు వంతెనలు, గట్టు ఒడ్డు నుంచి తలకిందులుగా నీటిలోకి దూకకూడదు. అలా చేస్తే పక్కనున్న రాళ్లకు, గట్టి నేలకు తలకొట్టుకుంటే దెబ్బలు తగులుతాయి. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు పోయే ముప్పు కూడా ఉంది. ఇక చెరువుల్లో దిగేముందు లోతు, నాచు, ఊబి గురించి తెలుసుకోవాలి. వాటిపై అవగాహన లేకుండా దిగితే ఈత వచ్చిన వారు కూడా ప్రమాదంలో చిక్కుకుంటారు. పిల్లలు ఈతకు వెళుతున్నపుడు వీలైనంత వరకూ ప్రమాదకరమైన విషయాల గురించి తల్లిదండ్రులు వారిని హెచ్చరించాలి. విద్యార్థుల ఖాళీ సమయాల్లో నిత్యం చదివే పాఠ్య పుస్తకాలతో పాటు విజ్ఞానదాయకమైన పుస్తకాలు చదివేలా వారిని ప్రోత్సహించాలి. ఈత సరదా, క్రికెట్ వంటి ఎండల్లో ఆడే ఆటలను నిలువరించి వారి దృష్టిని వేరే వ్యాపకాలపై మళ్లించాలి. ఇంటి వద్ద నీడపట్టునే ఉండే చదరంగం, క్యారమ్స్ తదితర ఆటలు ఆడుకునేలా ప్రోత్సహించాలి.

తల్లిదండ్రులే బాధ్యత తీసుకోవాలి



గోదావరి నది, కాలువల్లో పిల్లలను స్నానాలకు పంపించకూడదు. ఈత రాకుండా ఎవరైనా స్నానాలకు వస్తే వారిని బలవంతంగా స్నానాలకు దింప కూడదు. వేసవి సెలవుల్లో చిన్నారులను ఇంటివద్దే ఉండేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి. ప్రమాదకరమైన ప్రదేశాల్లో స్నానాలను నిషేధించాలి.

– **ఎస్ఎస్‌వీవీ రమేష్**, ఎస్సై, సమిశ్రగూడెం

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



తిరుమల శ్రీవారి ఆలయం బయట ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, సుమలత దంపతులు

నిడదవోలు: ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం తిరుమల వెళ్లారు. శ్రీనివాస్‌నాయుడు, సుమలత దంపతులు, కుమారుడు వరుణ్‌సాయి అక్కడ శ్రీవారిని దర్శించుకున్నారు. అక్కడ నుండి తిరుపతిలో తాతయ్యగుంట గంగమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

పేదలకు అన్నదానం

తాళ్లపూడి: దేవోక్తి చిడిపి సోషల్ సర్వీసు ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. తాళ్లపూడికి చెందిన బాలాజీ ఎలక్ట్రికల్స్ యజమాని రావులపాటి అనిత శ్రీనివాస రావు కుమార్తె మేఘన పుట్టినరోజు సందర్భంగా కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద, రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్ వద్ద గల 50 మంది పేదలకు భోజనాలు అందించారు. ఈ కార్యక్రమంలో దేవోక్తి చిడిపి సోషల్ సర్వీసు ప్రతినిధులు సాధనాల కిషోర్, ప్రత్తిపాటి అబెడ్నెగో పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేయండి



గోపాలపురం పొగాకు వేలం కేంద్రాన్ని పరిశీలిస్తున్న బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

- రైతులకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ సూచన
- గోపాలపురం వేలం కేంద్రం సందర్శన

గోపాలపురం: అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా రైతులు పొగాకును ఉత్పత్తి చేయాలని గుంటూరు పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్ అన్నారు. గోపాలపురం పొగాకు వేలం కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించి వేలం ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పొగాకు ధరలు ఆశాజనకంగా ఉన్నంత మాత్రాన సాగు విస్తీర్ణాన్ని పెంచవద్దని రైతులకు సూచించారు. ఏప్రిల్‌లో కిలో రూ.341 ధర పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారన్నారు. పొగాకు ఉత్పత్తికి అవసరమైన ఎరువులపై సబ్సిడీని పెంచాలని పలువురు రైతులు ఈ సందర్భంగా బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్‌ను కోరారు. ఐటీసీ ద్వారా నూతన వంగడాలైన 350, 353 విత్తనాలను సీటీఆర్ఐ ద్వారా సరఫరా చేయాలని కోరారు. ఆయన వెంట రాజమహేంద్రవరం రీజినల్ మేనేజర్ ఎం. ఆదిశేషయ్య, రైతు సంఘం ప్రతినిధులు గద్దే శేషగిరిరావు, పిన్నమనేని మధుమోహన్, రైతు సంఘం అధ్యక్షుడు ఇల్లూరి రాంబాబు, కూసం రామమోహన్‌రెడ్డి, పెంటల రాజు, వేలం నిర్వహణాధికారి అమూల్ డి శ్యామ్, గోపాలపురం ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, రైతులు కొర్లపాటి అన్నవరం, నందమూరి సత్యనారాయణ, బోర్డు సిబ్బంది ఉన్నారు.

భూమికి సారం..వారికి జీవనాధారం



అనంతపల్లి శివారు పొలాల్లో కట్టిన గొర్రెల మంద

- పొలాల్లో గొర్రెల మందలు
- పాత సంప్రదాయ పద్ధతులపై రైతుల ఆసక్తి

నల్లజర్ల: మోతాదుకు మించి రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకంతో భూసారం నానాటికీ తగ్గిపోతోంది. ఈ మార్పు భవిష్యత్తు తరాలకు ప్రతికూలంగా మారే ముప్పు ఉందని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులను హెచ్చరిస్తున్నారు. దీంతో రైతుల ఆలోచనా విధానంలోనూ క్రమేమీ మార్పు వస్తోంది. భూసారాన్ని పెంచేందుకు వారిప్పుడు పాత సంప్రదాయ పద్ధతులను అనుసరించేందుకే ఆసక్తి కనబరుస్తున్నారు. పొలాల్లో గొర్రెలు, మేకల మందలు కట్టడం, చెరువు పూడిక మట్టిని, కుళ్లిన పశువుల పెంటను పొలాల్లో వేయడం, పచ్చిరొట్ట సాగు వంటి పద్ధతులను పాటిస్తున్నారు. దీంతో పాటు సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా భూసారాన్ని పెంచుకోవడంపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో భూములకు గొర్రెలు, మేకలు, ఆవుల విసర్జితాలను అందించడంపై రైతులు మక్కువ కనబరుస్తున్నారు. వాటి ఎరువులు భూ సారాన్ని కాపాడి పంటకు జవసత్వాలు ఇచ్చి, నాణ్యమైన దిగుబడుల పెంపునకు దోహదం చేస్తాయంటున్నారు. ప్రస్తుతం పొగాకు పంట కాలం పూర్తయింది. ఖాళీగా ఉన్న భూముల్లో పగటి వేళల్లో మేకలు, గొర్రెలను తిప్పడంతో పాటు రాత్రి పూట పొలాల్లోనే వాటి మంద కట్టడం ద్వారా భూసారాన్ని పెంచుకునే యత్నాల్లో రైతులు ఉన్నారు.

రసాయన ఎరువులు అధికంగా వాడిన భూములలో వచ్చిన చౌడు పరిస్థితులు ఇలా గొర్రెల మంద కట్టి మలమూత్రాల విసర్జనతో విరిగిపోతుందంటున్నారు. వాటి విసర్జితాల్లో నత్రజని, భాస్వరం, పొటాష్‌తో పాటు సూక్ష్మ పోషకాలు ఉంటాయని మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ వివరిస్తున్నారు. మంద కట్టిన తర్వాత భూమిని దున్నుకోవాలని ఆయన రైతులకు సూచించారు. భూమిలో మేలు చేసే సూక్ష్మ జీవులు వృద్ధి చెంది, తెగుళ్లు తగ్గుతాయన్నారు.

'నన్నయ'కు రూరల్ పోస్టల్ బ్యాలెట్ల తరలింపు



స్ట్రాంగ్ రూమ్‌కు పోస్టల్ బ్యాలెట్లను తరలిస్తున్న సిబ్బంది, చిత్రంలో జేసీ తేజ్ భరత్ తదితరులు

రాజానగరం: రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్లను ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలోని స్ట్రాంగ్‌రూమ్‌కు భద్రంగా తరలించామని ఆ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ నియోజకవర్గం నుంచి పోలైన 3,033 పోస్టల్ బ్యాలెట్లను ఇంత వరకూ బొమ్మూరులోని న్యాక్ భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో ఉంచారు. శుక్రవారం అక్కడ నుంచి సంబంధిత రాజకీయ నాయకుల సమక్షంలో పోలీసు బందోబస్తు నడుమ నన్నయ వర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌కి తరలించారు. కార్యక్రమంలో కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.కృష్ణ నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం.భానుప్రకాష్, డీటీ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా కాల్పులు, ర్యాలీలు నిషేధం

- రాజమహేంద్రవరం దిశ డీఎస్పీ ఆదినారాయణ
- కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశం



నిడదవోలు సమావేశంలో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం దిశ డీఎస్పీ ఆదినారాయణ

నిడదవోలు: సార్వత్రిక ఎన్నికల్లో ఎవరు గెలిచినప్పటికీ బాణసంచా కాల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం నిషేధమని రాజమహేంద్రవరం దిశ డీఎస్పీ ఆదినారాయణ స్పష్టం చేశారు. పోలింగ్ కౌంటింగ్ ఏజెంట్లకు దిశా నిర్దేశం చేస్తూ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ వచ్చే నెల 4న ఎన్నికల కౌంటింగ్‌కు పార్టీ అభ్యర్థితో పాటు ఏజెంట్ మాత్రమే ఓట్ల లెక్కింపు ప్రాంతానికి వెళ్లాలన్నారు. శాంతి భద్రతల సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు ముగిసిన 48 గంటల వరకూ ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. ప్రస్తుతం 144వ సెక్షన్ అమలులో ఉన్నందున బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలు నిర్వహించరాదన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా వాట్సాప్ గ్రూపుల్లో పోస్టింగులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిడదవోలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.వెంకటరమణ నాయక్ మాట్లాడుతూ కౌంటింగ్ రోజున ఏజెంట్లుగా వెళ్లే వారందరూ ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏజెంట్ల నియామక పత్రాలు పొందాక, వాటిని తీసుకొని కౌంటింగ్ ప్రాంతానికి వెళ్లాలని సూచించారు. తహసీల్దారు నాగభూషణం, మున్సిపల్ కమిషనర్ రామ్‌భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక ఘటనలకు పాల్పడితే చర్యలు

ఉండ్రాజవరం: ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజున ఎవరైనా అసాంఘిక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నిడదవోలు సీఐ జానకిరామయ్య హెచ్చరించారు. కార్డన్ అండ్ సెర్చ్‌లో భాగంగా మండలంలో తాడిపర్రు గ్రామంలో శుక్రవారం సీఐ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో వారు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో సరైన పత్రాలు లేని ఏడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. గ్రామంలోని వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు ఉండాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు గ్రామంలో సంచరించినా, ఎవరైనా పెట్రోలు, మందుగుండు సామగ్రి నిల్వ చేసినా తమకు సమాచారం అందించాలని ఎస్సై వి.అప్పలరాజు సూచించారు. ఈ సెర్చ్‌లో నిడదవోలు ఎస్సై అప్పారావు, నిడదవోలు రూరల్ ఎస్సై రమేష్, పెరవలి ఎస్సై మూర్తి, ఉండ్రాజవరం ఏఎస్సై కె.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



తాడిపర్రులో కార్డన్ అండ్ సెర్చ్‌లో భాగంగా ఒక ఇంట్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

రెండు గ్రామాల్లో కార్డన్ సెర్చ్

దేవరపల్లి: మండలంలోని లక్ష్మీపురం, దుద్దుకూరు గ్రామాల్లో శుక్రవారం దేవరపల్లి సీఐ పి.బాల సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఎస్సై కె. శ్రీహరిరావు, సిబ్బంది కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. లక్ష్మీపురంలో రికార్డులు లేని 10 బైక్‌లను పట్టుకుని, సంబంధిత యజమానులకు జరిమానా విధించినట్టు ఎస్సై శ్రీహరిరావు తెలిపారు. ముగ్గురు వ్యక్తుల నుంచి 25 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, వారిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. దేవరపల్లిలో ఒక వ్యక్తి నుంచి 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.



లక్ష్మీపురంలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న సీఐ బాల సురేష్ బాబు, సిబ్బంది

కలెక్టర్‌కు నర్సరీ రైతుల వినతి

కడియం: నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు ఆధ్వర్యంలో రైతులు శుక్రవారం కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలతకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ కారణంగా బంకుల్లో పెట్రోల్, డీజిల్‌ను టిన్నుల్లో నింపేందుకు నిరాకరిస్తున్నారన్నారు. దీంతో నీటిని తోడే ఇంజిన్లు, మందుల పిచికారీకి వాడే స్ప్రేయర్లను ఉపయోగించడం కష్టంగా మారిందన్నారు. నర్సరీ రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసి పెట్రోలు, డీజిల్ లభించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని పోలరాజు స్థానిక విలేకరులకు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో గాద నాగేశ్వరరావు, వడ్లమూరి రాజేష్ తదితరులు ఉన్నారు.



కలెక్టర్ మాధవీలతకు వినతిపత్రం అందజేస్తున్న మల్లు పోలరాజు తదితరులు

ఖాతాదారులకు మెరుగైన సేవలు

రాజమహేంద్రవరం సిటీ: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా ఖాతాదారులకు విద్య, వాహనం, గృహ నిర్మాణం, పర్సనల్ రుణాలను అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఆ బ్యాంక్ రీజినల్ హెడ్ ఎ.విశ్వేశ్వరరావు తెలిపారు. స్థానిక జాంపేటలోని ఉమా రామలింగేశ్వరస్వామి కల్యాణ మండపంలో శుక్రవారం మెగా రిటైల్ ఎక్స్‌పో గ్రాండ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు, వాహన డీలర్లు, రియల్ ఎస్టేట్ డీలర్లను ఒకే చోట పరిచయం చేయడం ద్వారా అవసరమైన గృహాలు, వాహనాలను ఎంపిక చేసుకోవడం సులభమవుతుందన్నారు. బ్యాంక్ డిప్యూటీ జోనల్ హెడ్ పి.కృష్ణయ్య సుమారు 40 మందికి రుణమంజూరు పత్రాలను అందజేశారు. అలాగే 80 మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ హెడ్ డి.రామమోహనరావు, రీజినల్ లోన్ ప్రాసెసింగ్ సెంటర్ హెడ్ సుధీర్, బ్రాంచ్ మేనేజర్లు, అధికారులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

రౌడీయిజం చేస్తే కఠిన చర్యలు

ధవళేశ్వరం: రౌడీయిజం చేస్తే సహించేది లేదని దక్షిణ మండల డీఎస్పీ అంబికా ప్రసాద్ హెచ్చరించారు. రౌడీషీటర్లు, బ్లేడ్ బ్యాచ్‌ల ఆగడాలను ఉపేక్షించేది లేదన్నారు. ఈనెల 21వ తేదీన ఇందిరా కాలనీకి చెందిన యువకుడు కంచర్లలైన్ మరిడమ్మ గుడి దగ్గర ఉండగా అదే ప్రాంతానికి చెందిన రంగాల దుర్గా సాయి (పులి) వచ్చి రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశాడన్నారు. ఇవ్వకపోవడంతో బ్లేడ్ చూపించి చంపేస్తానని బెదిరించి రూ.వెయ్యి, సెల్‌ఫోన్‌ను బలవంతంగా లాక్కొని వెళ్లిపోయాడన్నారు. దీనిపై యువకుడు ఫిర్యాదు చేయడంతో ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు వేగవంతంగా దర్యాప్తు చేపట్టి రంగాల దుర్గాసాయిని అరెస్ట్ చేశామన్నారు. కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారన్నారు. రంగాల దుర్గాసాయిపై గతంలోనే ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో మూడు కేసులు ఉన్నాయన్నారు. అతడిపై రౌడీ షీట్ తెరుస్తామన్నారు. రౌడీషీటర్లు, బ్లేడ్ బ్యాచ్‌లు దౌర్జన్యాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. దీనిపై ఇప్పటికే సీఐలకు, ఎస్సైలకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని డీఎస్పీ తెలిపారు.

వ్యక్తిగత పర్యటనలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా వ్యక్తిగత పర్యటనకు పయనమయ్యారు. ఈ కారణంగా ఈ నెలాఖరు వరకు ఆయన అందుబాటులో ఉండరు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి నియోజకవర్గ ప్రజలందరికీ అందుబాటులో ఉంటారని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా, ఏ అవసరం ఉన్నా 99852 55555, 98663 55655 నంబర్లను సంప్రదించాలని కోరారు.